క్లుప్తంగా

వేమూరు హైస్కూలు హెచ్‌ఎంగా పద్మజ



వేమూరు: స్థానిక జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా పద్మజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు హెచ్‌ఎంగా పని చేసిన నాగరత్నం పదోన్నతిపై యడ్లపాడు ఎంఈవో-1గా వెళ్లారు. ఆమె స్థానంలో గుంటూరు గర్ల్స్ హైస్కూలులో లెక్కల టీచర్‌గా పని చేస్తున్న పద్మజ పదోన్నతిపై హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సబ్సిడీపై వరి విత్తనాలు సిద్ధం

చెరుకుపల్లి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి టి. బాలాజీ గంగాధర్ తెలిపారు. బీపీటీ 5204 రకం విత్తనాలు కేజీ ధర రూ. 37.90 కాగా సబ్సిడీ రూ. 5 పోగా రైతులకు రూ.32.90కు లభిస్తాయని పేర్కొన్నారు. 25 కేజీల బస్తా రూ. 822.50కు లభిస్తుందని చెప్పారు. గట్లపై నాటుకునేందుకు కంది విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు దాతలు బుధవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలలో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ. 30 వేలను హెచ్‌ఎం జి. స్వామికి దాతలు ధూళిపాళ్ల పూర్ణచంద్రరావు, ఏఎస్‌ఎం లీలారాణి, గోగినేని సుదర్శనరావు, గోగినేని లక్ష్మయ్య అందచేశారు. కార్యక్రమంలో కొమ్మినేని శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు రామకోటయ్య, పి. ప్రసాద్, కె. సతీష్ పాల్గొన్నారు.

కర్లపాలెం ఇన్‌చార్జి వీఆర్వోగా రమేష్ రెడ్డి

కర్లపాలెం: ఇన్‌చార్జ్ వీఆర్వోగా రమేష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు వీఆర్వోగా పనిచేస్తున్న చంద్రశేఖర్ సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్‌పై జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో తుమ్మలపల్లి వీఆర్వోగా పనిచేస్తున్న రమేష్‌రెడ్డికి కర్లపాలెం ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతల్ని తహసీల్దార్ కేశవనారాయణరావు అప్పగించారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



కర్లపాలెం: వేరుశనగ సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ ఓబయ్య, శాస్త్రవేత్త సురేఖ తెలిపారు. మండల పరిధిలోని పాత నందాయపాలెం, కర్లపాలెంలోని వేరుశనగ పైర్లను బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేరుశనగలో రసం పీల్చు పురుగు ఉధృతంగా ఉందని, నివారణకు మోనోక్రోటోఫాస్ పిచికారీ చేయాలని సూచించారు. వేరుశనగ పైరుపై పురుగు మందులతో పాటు వేపనూనె కలిపి పిచికారీ చేయడం వల్ల తల్లి రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించుకోవచ్చునని తెలిపారు. పిల్ల పురుగులను కూడా వేప నూనె చంపుతుందని రైతులకు వివరించారు. జింకు లోపం వల్ల కొన్ని మొక్కలు గిడసబారి పోతున్నాయని, దీని నివారణకు లీటరు నీటికి జింకు సల్ఫేట్ రెండు గ్రాములు కలుపుకుని పైరుపై పిచికారీ చేయాలని సూచించారు. పూత దశలో జిప్సం వేయడం వల్ల కాయలు గట్టిపడతాయని చెప్పారు. కార్యక్రమంలో డీడీఏ విజయనిర్మల, ఏవో సుమంత్‌కుమార్, ఏఈవోలు భాగ్యలక్ష్మి, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష లక్ష్యం



తురిమెళ్ల గ్రామ సచివాలయంలో కౌలు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

మంత్రి మేరుగ నాగార్జున

తురిమెళ్ల(వేమూరు): ప్రజల సమస్యల్ని సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష శిబిరాల్ని నిర్వహిస్తోందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. అమర్తలూరు మండలంలోని తురిమెళ్ల, పంచాళవరం గ్రామ సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. మొత్తం 929 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. ఇందులో కుల ధ్రువీకరణ పత్రాలు- 200, ఆదాయ పత్రాలు- 297, రేషన్ కార్డు-1, కౌలు గుర్తింపు కార్డులు- 409, ఆధార్ సర్వీసు- 22 ఉన్నాయి. పంచాళవరం గ్రామ సచివాలయంలో 547 సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో కుల ధ్రువీకరణ పత్రాలు- 218, ఆదాయ సర్టిఫికెట్లు - 211, రేషన్ కార్డు- 1, కౌలు గుర్తింపు కార్డులు- 117 ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వారికి కావాల్సినవి అడిగి, ఇప్పించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందని తెలిపారు. ప్రజల అవసరాలు తీర్చిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నియోజక వర్గ ప్రత్యేకాధికారి బొంత అర్జునరావు, మండల ప్రత్యేకాధికారి దేవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు మూల్పూరు లావణ్య, గ్రామ సర్పంచులు ఇందిరాదేవి, రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు మానుకొండ ఝాన్సీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పాలనలో విప్లవాత్మక మార్పు

బాపట్ల అర్బన్: జగనన్న సురక్షతో ప్రభుత్వం పాలనలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బాపట్ల పట్టణంలోని దళిత వారి వీధి, మార్కెట్ బజార్ సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు వంటి పనుల్ని చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసిందని తెలిపారు. దళారీల ప్రమేయం లేకుండా వలంటీర్లు ఇంటికి వచ్చి, సమస్యల్ని తెలుసుకొని వాటిని పరిష్కరించడం అనేది ఆంధ్రప్రదేశ్ మినహా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్ ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. రెండు సచివాలయాల్లో 800 దరఖాస్తులు రాగా, అధికారులు వెంటనే వాటిని పరిశీలించి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో బాపట్ల పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి, అవుట్ సోర్సింగ్ డైరెక్టర్ గోరుముచ్చు పుష్పరాజ్యం, మీరాబి, సయ్యద్ పీర్, జేసీఎస్ కన్వీనర్ చింతల రాజశేఖర్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్, సర్వే శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సర్టిఫికెట్లు ఉచితం

రేపల్లె రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పలు సర్టిఫికెట్లను ఉచితంగా పొందవచ్చని తహసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని గంగడిపాలెం సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన గ్రామసురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 600 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమలశెట్టి శివాజీ, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● గుడ్డికాయలంక సచివాలయ పరిధిలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో శివపార్వతి, సర్పంచ్ ఉయ్యూరు శ్రీనివాసరావుల చేతుల మీదగా పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు

కొల్లూరు : అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు జగనన్న సురక్ష ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఆధార్ కార్డులు దక్కేలా కార్యకర్తలు కృషి చేయాలని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి. విజయలక్ష్మి తెలిపారు. కొల్లూరు ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ భవనంలో బుధవారం కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహార వివరాల్ని ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. సమావేశంలో ఏసీడీపీవో బి. విజయరాణి, సూపర్‌వైజర్లు టి. విజయలక్ష్మి, పి. నగరాజకుమారి, కె. మాధవి, జె.వి. రమణమ్మ, బి. శాంతిశ్రీ , డి. మాణిక్యమ్మ, బేబీస్వర్ణలత, ఫజరున్నీసా పాల్గొన్నారు.



గంగడిపాలెంలో పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు తదితరులు



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

ఉపాధ్యాయులకు సన్మానం



పదోన్నతి పొందిన శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



భట్టిప్రోలులో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చావలి(వేమూరు): చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం బదిలీ అయిన తొమ్మిది మంది ఉపాధ్యాయుల్ని హెచ్‌ఎం మన్నేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయుడు తాండవ కృష్ణను (ఐలవరం) హైస్కూలుకు, శివరామకృష్ణ (వెల్లటూరు), ఏ. రవి (అమర్తలూరు), కె. సీతారామమూర్తి (అంగలకుదురు), మీనాకుమారి (దుగ్గిరాల), అనంతలక్ష్మి (కొల్లిపర), శివపార్వతి (తూములూరు), హెప్సిబా (మూల్పూరు) బదిలీ అయ్యారు. పదోన్నతిపై వై. శ్రీనివాసరావు నూజెండ్ల మండలంలోని పాత నాగిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వెళ్లారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

మండలం ఐలవరం జెడ్పీ హైస్కూలులో ప్రధానోపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్లిన కాటూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పిల్లి చిరంజీవి బాబు, కె. ఉమామహేశ్వరరావు, శశికిరణ్, అత్తోట చిలకమ్మ, తేజారాణి, ఉద్దంటి వెంకటనారాయణ, ఏడుకొండలు, అద్దంకి వెంకటేశ్వర్లును బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాచర్ల మోహన్‌రావు, కర్రా అరుణ కుమారి, ఉపాధ్యాయులు వేదాంతం బదరీనాథ్, రవిరామకిశోర్, సీహెచ్. తాండవ కృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కారుకు ప్రమాదం



కొల్లూరు:తహసీల్దార్ ప్రయాణిస్తున్న కారు పంట కాల్వలోకి జారి పోయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కొల్లూరు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు సొంతంగా కారు నడుపుకుంటూ విధి నిర్వహణలో భాగంగా కొల్లూరు నుంచి దోనేపూడి వెళుతున్నారు. కొల్లూరు సమీపంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ దాటిన అనంతరం ఎదురుగా దోనేపూడి వైపు వెళుతున్న లారీని అధిగమించేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఎదురు నుంచి కొల్లూరు వైపు ద్విచక్ర వాహనదారుడు వస్తుండటంతో కారును పక్కకు మళ్లించే క్రమంలో నియంత్రణ కోల్పోయి, రోడ్డు అంచుల కిందకు వెళ్లింది. వర్షం కారణంగా భూమి చిత్తడిగా మారడంతో పక్కనే ఉన్న పంట కాల్వలోకి జారిపోయింది. ప్రమాదం నుంచి తహసీల్దార్ సురక్షితంగా బయటపడ్డారు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న స్థానికులు ఆయనకు సాయమందించి క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి సంఘటన ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కారును పొక్లెయిన్ సాయంతో బయటకు తీయించారు.

ఘనంగా అంతర్జాతీయ చిరుధాన్యాల వేడుక



బాపట్ల అర్బన్: పట్టణంలోని రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాల్లో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సర వేడుకల్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చిరుధాన్యాల వంటల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం మిల్లెట్స్ విభాగం ప్రిన్సిపల్ సైంటిస్ట్, అసోసియేట్ డీన్‌గా వ్యవహరించిన రిటైర్డ్ ప్రొఫెసర్ రొటేరియన్, డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి పర్యవేక్షణలో పోటీల్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆహారంలో చిరు ధాన్యాలు ఉండేట్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.సౌజన్య, డాక్టర్ బ్లెస్సి సాగర్ శీలం, డాక్టర్ విమల బీర వ్యవహరించారు. విజేతలకు బహుమతులను విజయ్ టీవీ హోం అధినేత బొమ్మిశెట్టి శివ మాణిక్యరావు, పద్మజ దంపతులు అందించారు. కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ రావూరి వీరరాఘవయ్య, సెక్రెటరీ కోళ్లపూడి ఉపేంద్ర గుప్తా, అసిస్టెంట్ గవర్నర్ సుధీర్ కుమార్, సీనియర్ సభ్యులు బూర్లే రామ సుబ్బారావు, సీడీపీవో శైలజ, ఏలూరి హరిబాబు, కొల్లా శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి రాంబాబు, కొత్త ప్రసాదు, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ పర్యవేక్షించారు.

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



చెరుకుపల్లి: నాడు-నేడు పనుల్ని నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగజ్యోతి ఆదేశించారు. మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిది గదులు నిర్మాణంలో ఉండగా, వాటిలో ఆరు శ్లాబ్ వేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగిలిన పాఠశాలల్లో పనులు కూడా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాల్ని ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు పరిశీలించాలని ఆమె సూచించారు. ఆమె వెంట ఏఈ రాజేష్, గుళ్లపల్లి పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిశోర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

డెంగీ వ్యాప్తిపై అప్రమత్తత అవసరం

యాజలి(కర్లపాలెం): దోమల వల్ల వ్యాప్తి చెందే డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో దీప్తి సౌజన్య సూచించారు. యాజలి హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దీప్తి సౌజన్య మాట్లాడుతూ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ఇప్పుడు మలేరియా, డెంగీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దోమలు కుట్టకుండా అందరూ దోమతెరలు వినియోగించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్జిన్ దిగితే ముప్పే..



భట్టిప్రోలు: భట్టిప్రోలు-రేపల్లె రహదారి అధ్వానంగా మారింది. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే మార్జిన్‌లో దిగాలంటే వాహనదారుల అవస్థలు అన్నీఇన్నీ కావు. మార్జిన్లు పోవడమే కాక రహదారికి ఇరువైపులా గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి మేరుగ నాగార్జున



ఆలపాటినగరంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రజల కష్టాల్ని తొలగించి ఆనందకర జీవనం గడపడానికి అవసరమైన సంక్షేమ పథకాలతో పాటు, గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని దోనేపూడి శివారు ఆలపాటినగరం, దోనేపూడి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు తమ పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయని పలువురు లబ్ధిదారులు మంత్రి వద్ద ప్రస్తావించారు. పేద ప్రజల కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి తాము మద్దతుగా నిలుస్తామని ఆయనకు మాటిచ్చారు. గ్రామంలో అంతర్గత డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తమవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి రూ. 75 లక్షలు ఇప్పటికే మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులకు ఇళ్ల స్థలాలతో పాటు, ఇతర సంక్షేమ పథకాలు అందజేస్తామని, స్థానిక సమస్యల్ని సత్వరం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆలపాటినగరం వాసుల చిరకాల కల అయిన ఫుట్ బ్రిడ్జిని హామీ ఇచ్చిన విధంగా పూర్తి చేయించినట్లే.. ఇతర సమస్యల్ని సైతం పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు వాగోలు గౌతమి, సూరపనేని వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, పోలిమట్ల ఆనంద్‌కిశోర్, వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, దోనేపూడి, ఈపూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్లు నిమ్మగడ్డ శివరామకృష్ణప్రసాద్, సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు అయిల సుబ్బారావు, అన్నపురెడ్డి వీరారెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వెనిగళ్ల శ్రీనివాసరావు, కొమ్ము గోపి, బేతపూడి భాస్కరరావు, చిలక ప్రకాశం, రవి, మధు, నాగేంద్రం, సురేష్, మద్దాల రవి, వెనిగళ్ల రామారావు, వెనిగళ్ల నాగేశ్వరరావు, పర్వతనేని రంగారావు, రెబ్బా శ్రీనివాసరావు, వీరంకి నాగేశ్వరరావు, రత్నం, బందెల నాగమల్లేశ్వరరావు, ఇంటూరి బాబురావు, కనపర్తి మోహన్‌రావు, తోడేటి రత్నాకర్, శ్రీనివాసరెడ్డి, వక్కలగడ్డ శ్రీను, పిల్లి బుజ్జి, పరిశ రంగారావు, ఎంపీడీవో ఐ. సత్యనారాయణరావు పాల్గొన్నారు.

శేషాచార్యులకు ఆర్ష విజ్ఞాన నిధి పురస్కారం



శేషాచార్యులను సత్కరిస్తున్న సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు

చెరుకుపల్లి: హిందూ ధర్మ ప్రచారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న గొప్ప పండితుడు, సమరసతా సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ అగ్నిహోత్రం శేషాచార్యులు అని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ ఎస్. శ్రీనివాస్ కొనియాడారు. మండలంలోని గుళ్లపల్లి శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ వ్యాస పౌర్ణమి గురుపూజోత్సవాల్లో భాగంగా శేషాచార్యులను ఆర్ష విజ్ఞాన నిధి బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శేషాచార్యులు వాస్తు, ఆగమ శాస్త్రాల్లో అసమాన ప్రతిభ కలిగి, ఇప్పటికి 300పైగా దేవస్థాన ప్రతిష్టలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, ఆనందీశ్వరస్వామి ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు బండారు జ్వాలా నరసింహం, రాయపూడి అంకమ్మచౌదరి, పడమట వెంకటేశ్వరరావు, బొలగాని విజయలక్ష్మి, ఎల్లాప్రగడ సీతాపతి, జంజనం హేమశంకరరావు ఆలయ కమిటీ చైర్మన్ ఉల్లంగుంట సాంబశివరావు పాల్గొన్నారు.

11న విజయవాడలో నాయీ బ్రాహ్మణ మహాసభలు



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘ నాయకులు

రేపల్లె: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ మహాసభలు ఈ నెల 11వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షవరపు సూరిబాబు తెలిపారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ మహాసభల కరపత్రాల్ని నాయకులతో బుధవారం విడుదల చేసి అనంతరం మాట్లాడారు. నాయీ బ్రాహ్మణుల భవిష్య కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించే మహాసభలకు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు యడ్లపల్లి కిశోర్‌బాబు, నాయకులు అద్దేపల్లి సాంబశివరావు, నాయకులు మోపిదేవి శివనాగేశ్వరరావు, కొల్లూరు అప్పారావు, కొంజేటి బాజీ, వెంకట్రామయ్య, నాని పాల్గొన్నారు.

జాబ్ కార్డులున్న వారందరికీ పనులు



ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శంకర్‌నాయక్

కర్లపాలెం: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులున్న అందరికీ పనులు కల్పించాలని డ్వామా పీడీ వై.శంకర్ నాయక్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వలసల్ని నివారించేందుకు కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. కర్లపాలెం మండల పరిధిలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు కూలీలకు 1,90,000 పని దినాలు కల్పించినందుకు ఫీల్డ్ అసిస్టెంట్లను పీడీ అభినందించారు. కూలీలందరికీ 100 రోజుల పని దినాలతో పాటు రోజుకి రూ.270 తగ్గకుండా చేయించాలని సిబ్బందికి చెప్పారు. వర్షాకాలంలో కూలీలకు ఇబ్బంది కలగని విధంగా పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ ఆర్. భవాని, ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వీడి పనిచేయాలి

నిజాంపట్నం: ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వీడి పనిచేయాలని డ్వామా పీడీ శంకర్‌నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో నాగలక్ష్మి అధ్యక్షతన ఉపాధి పనులపై టీఏ, ఎఫ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో చేసిన పనుల్ని పరిశీలించినట్లు చెప్పారు. విశాలమైన నిజాంపట్నం మండలం మాత్రం పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వెనకబడినట్లు తెలిపారు. టీఏలు, ఎఫ్‌ఏలు కలసికట్టుగా పనిచేసి, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించి మండలాన్ని ముందుకు తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. అనంతరం మండలంలో జరిగిన పలు పనులపై టీఏలు, ఎఫ్‌ఏలతో చర్చించారు. సమావేశంలో ఏపీడీ భవాని, ఎంపీడీవో నాగలక్ష్మి పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బాపట్ల టౌన్: యువతిని వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై రూరల్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. మండలంలోని కొండుబోట్లవారిపాలెం గ్రామానికి చెందిన శ్యాంబాబు అదే గ్రామానికి చెందిన యువతిని నిత్యం అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె పోలీసుల్ని ఆశ్రయించింది. రూరల్ ఎస్ఐ శ్యాంబాబుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేదింపులపై...

అధిక కట్నం తెమ్మంటూ భర్త, అత్త వేధింపులకు గురి చేస్తున్నారంటూ పట్టణంలోని హైయ్యర్‌నగర్‌కు చెందిన బేతాళం రజని బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పొన్నూరు మండలం, కొండమూదికి చెందిన బాధితురాలి భర్త సుధాకర్, అత్త రాజేశ్వరిపై పట్టణ ఎస్ఐ సింగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

